క్లుప్తంగా

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం ఖాయం

మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి



మాట్లాడుతున్న ప్రతాప్ రెడ్డి

కొందుర్గు: రాష్ట్రంలో కాంగ్రెస్‌కు పూర్వ వైభవం రావడం ఖాయమని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి అన్నారు. మంగళవారం కొందుర్గులో ఏర్పాటుచేసిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పేద, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్, షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ కుటుంబ పాలనను సాగనంపాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, కావలి రాజు, కొత్తూర్ మాజీ జెడ్పీటీసీ శ్యామ్‌సుందర్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి, జితేందర్ రెడ్డి, వజ్రమ్మ, రజిత, పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో యువకుడు

కడ్తాల్: మండలంలోని మైసిగండి ఆలయ సమీపంలో మంగళవారం ఉదయం పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గుర్తుతెలియని యువకుడు(26) పోలీసులకు కనిపించాడు. యువకుడిని విచారించగా అతను మూగ, చెవిటి వాడని తెలిసింది. మెదక్ జిల్లాకు చెందిన వాడని స్థానికులు చెప్పడంతో వెంటనే మెదక్ పోలీస్ కంట్రోలు రూంకు సమాచారం ఇచ్చారు. ఎవరికైనా యువకుడికి సంబంధించిన వివరాలు తెలిసి ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ శివ ప్రసాద్ కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కడ్తాల్: మండల పరిధిలోని ముద్వీన్ గ్రామానికి చెందిన శంకరయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని స్థానిక జెడ్పీటీసీ. రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్ మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, రైతు బంధు జిల్లా సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ గోపాల్, సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి,యాదయ్య, ఉప సర్పంచ్ వినోద్ ఉన్నారు.

మలుపులున్నాయి... జర జాగ్రత్త

సూచికలు లేని మలుపులతో తరుచూ ప్రమాదాలు

కడ్తాల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో ప్రమాదకర మలుపులతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మూల మలుపుల వద్ద ఎటువంటి సూచిక బోర్డులు లేక పోవడంతో వాహనచోదకులు తరుచు రోడ్డు ప్రమాదాల బారిన పడుతూ గాయాలయిన ఘటనలు, మృత్యువాత పడ్డ సంఘటనలు అనేకం ఉన్నాయి. పెద్ద ప్రమాదాలు జరగక ముందే సంబంధిత శాఖ అధికారులు చర్యలు చేపట్టి, సూచిక బోర్డులతో పాటు, ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి చేశా.. ఆశీర్వదించండి

హయత్‌నగర్: నియోజకవర్గాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేశానని, మరింత అభివృద్ధి చేసేందుకు మరోసారి అవకాశం ఇవ్వాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ప్రజలను విజ్ఞప్తి చేశారు. మంగళవారం ప్రచారంలో భాగంగా ఆయన తుర్కయాంజాల్ మున్సిపాలిటీలోని మన్నెగూడ, రాగన్నగూడ, ఇంజాపూర్, మునుగనూరు, తొర్రూరు, బ్రాహ్మణపల్లిల్లో పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మున్సిపాలిటీలోని ప్రతి కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి దళితబంధు, బీసీబంధు పథకాలను అందించామన్నారు. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ఆయా పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేస్తామని తెలిపారు. ఎన్నికల్లో మరోసారి గెలిపిస్తే ఆసరా పింఛన్లు ఐదువేలకు, రైతుబంధు పదహారు వేలకు పెంచుతామన్నారు. రూ. 400కే గ్యాస్ బండ అందిస్తామని, ప్రతి ఒక్కరికి 10 లక్షల బీమా చేస్తామని, రైతుకూలీలకు కూడా బీమా సౌకర్యం కల్పిస్తామని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రాష్ట్రం మరోసారి అంధకారంలోకి వెళ్తోందన్నారు. కారు గుర్తుకు ఓటేసి మరోసారి అవకాశం కల్పించాలని అభ్యర్థించారు. మల్లేశ్, లక్ష్మారెడ్డి, కొత్తకుర్మ సత్తయ్య, బల్‌దేవ్‌రెడ్డి, కౌన్సిలర్‌లు పాల్గొన్నారు.

మామను గెలిపిస్తే మంత్రవుతాడు..

యాచారం: మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అంటేనే మంచితనం...కారు గుర్తుకు ఓటేసి నాలుగోసారి గెలిపిస్తే మామ మంత్రవుతాడు... కారు గుర్తును మర్చిపోవద్దు అంటూ మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కోడలు మౌనిక ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని నస్దిక్‌సింగారం గ్రామంలో మంగళవారం ఇంటింటికి తిరిగి కారు గుర్తుకు ఓటేయాలని ప్రజలను అభ్యర్థించారు.

వీధికుక్కల వీరవిహారం

- గొర్రెల మందలపై దాడులు
- వాహనదారులను వెంబడిస్తున్న వైనం
- పెరుగుతున్న బాధితుల సంఖ్య
- భయాందోళనలో గ్రామస్తులు



చిలుకూరులో రోడ్డుపై తిరుగుతున్న వీధికుక్కలు

మొయినాబాద్: వీధికుక్కలు గ్రామాల్లో స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులు గుంపులుగా ఒక్కచోట చేరి వాహనదారులను వెంబడిస్తూ మరీ దాడి చేస్తున్నాయి. గొర్రెల మందలపై దాడి చేసి వాటిని చంపేస్తున్నాయి. మొయినాబాద్ మండల కేంద్రంతోపాటు చిలుకూరు, పెద్దమంగళారం, అప్పోజీగూడ, చందానగర్, రెడ్డిపల్లి, మోత్కుపల్లి, ఎలుకగూడ, కుత్బుద్దీన్‌గూడ, మేడిపల్లి, సురంగల్, అమ్డాపూర్, శ్రీరాంనగర్, కనకమామిడి, వెంకటాపూర్, కేతిరెడ్డిపల్లి తదితర గ్రామాల్లో వీధికుక్కలు బెడద ఎక్కువయ్యాయి. రోడ్లపై గుంపులు గుంపులుగా తిరుగుతూ వచ్చిపోయే ద్విచక్రవాహనదారులను వెంబడించి దాడికి పాల్పడుతున్నాయి. దీంతో వాహనదారులు భయాందోళనకు గురై అదుపు తప్పి ప్రమాదాల బారినపడుతున్నారు. ముఖ్యంగా గొర్రెల, మేకల మందలపై దాడులు చేసి జీవాలను చంపేస్తున్నాయి. ఇటీవల కేతిరెడ్డిపల్లి, నాగిరెడ్డిగూడ, అమ్డాపూర్, సురంగల్ తదితర గ్రామాల్లో గొర్రెల మందలపై కుక్కలు దాడి చేసి వందల సంఖ్యలో జీవాల ప్రాణాలు తీశాయి. రోడ్లపై నడుచుకుంటూ వేళ్లేవారిపై, చిన్నపిల్లలపై దాడులు చేసి కరుస్తున్నాయి. దీంతో బాధితుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నారని గ్రామస్తులు పేర్కొన్నారు. హైదరాబాద్‌నగరం నుంచి తెచ్చి గ్రామీణ ప్రాంతాల్లో వాటిని వదులుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఇటీవలి కాలంలో గ్రామాల్లో వీధికుక్కలు ఎక్కువయ్యాయి. ఒక్కో గ్రామంలో సుమారు 100నుంచి 200 వరకు వీధికుక్కలు ఉన్నాయి. కుక్కలు రోడ్లపై తిరుగుతుండడంతో వాహనదారులతోపాటు, నడుచుకుంటూ వెళ్లే వారు, స్థానికులు భయపడుతున్నారు. గ్రామ పంచాయతీ పాలకవర్గాలు, పంచాయతీ అధికారులు వీధికుక్కలను పట్టించుకోవడంలేదు. రోజురోజుకు ఈ కుక్కల బెడద పెరుగుతున్నా వాటిని నియంత్రించే చర్యలు చేపట్టడంలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో వీధి కుక్కలను పట్టుకుని దూర ప్రాంతాల్లో వదిలేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆరోపణలు విడ్డూరం

డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి

చేవెళ్ల: ప్రజా స్వామ్యంలో ప్రజల కోసం పోరాటం చేసే నాయకులపై కేసులు ఉండడం సహజమేనని డీసీసీ మాజీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి, పీసీసీ సంయుక్త కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు వీరేందర్‌రెడ్డిలు పేర్కొన్నారు. చేవెళ్ల మండలకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే కాలె యాదయ్య తనపై కేసులు, అవినీతి లేనట్లుగా అవతలి వారిపై ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. పదేళ్ల అధికారంలో ఉండి ఏం అభివృద్ధి చేశాడో చెప్పాలన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం మెంబర్‌గా ఉన్నప్పుడు లడ్డులు, టికెట్లు, కందిపప్పులు అమ్ముకున్న కుంభకోణం కేసు మరిచిపోయావా అని ఎమ్మెల్యేను ఉద్దేశించి విమర్శించారు. ఎమ్మెల్యేగా గెలిచిన రెండుపర్యాయాలలో నియోజకవర్గంలో వెంచర్లలో ప్లాట్లు, విల్లాలకోసం బెదిరించి వాటిని తీసుకున్న చరిత్ర హీనుడన్నారు. భూదందాలు, కబ్జాలు చేసిన సంఘటనలు ఉన్నవిషయాన్ని మర్చిపోవద్దని ఆయన హెచ్చరించారు. అసలు ఎమ్మెల్యేకు ఓటు అడిగే హక్కులేదన్నారు. ఈ సమావేశంలో డీసీసీ నాయకులు పెంటయ్యగౌడ్, నియోజకవర్గం యూత్ ప్రధాన కార్యదర్శి ఎం. కార్తీక్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు మల్లేశ్, ఉప సర్పంచ్ క్రిష్ణగౌడ్, మాజీ సర్పంచ్ నర్సింలు, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటస్వామి, శ్రీనివాస్‌గౌడ్

నమ్మి మోసపోవద్దు



దేవరాంపల్లిలో మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

- ఎమ్మెల్యే కాలె యాదయ్య
- సంక్షేమ పథకాలే విజయానికి దోహదం
- కాంగ్రెస్, బీజేపీలను నమ్మరు



షాబాద్: ఎన్నికల ప్రచారంలో కాలె జయమ్మ, శాన్వి

చేవెళ్ల: కాంగ్రెస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. గొల్లపల్లి, ధర్మసాగర్, ఖానాపూర్, రేగడి ఘనాపూర్, దేవునపల్లి, నాంచేరి, ఇంద్రారెడ్డి నగర్, కిష్టాపూర్, ఇబ్రహీంపల్లి గ్రామాల్లో మంగళవారం ఎమ్మెల్యే అభ్యర్థి కాలె యాదయ్య ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలను కలిసి కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కాంగ్రెస్ అభ్యర్థికి నేర చరిత్ర, కేసులు, మరో అభ్యర్థికి నాయకుల యొక్క పార్టీల ఫిరాయింపులతో సతమత అవుతున్నారని, క్యాడర్ లేని వ్యక్తులు పోటీలో ఉన్నారని, ప్రజలు ఆలోచించి ఓటు వేయాలని కాలె యాదయ్య పేర్కొన్నారు. తన గురించి కూడా తెలుసుకునే ఓటు వేయాలని ఆయన ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం. మాలతి, సర్పంచులు శ్రీలత, నర్సింలు, నరహరిరెడ్డి, భీమయ్య, వెంకటేశంగుప్తా, వెజ్ బోర్డు చైర్మన్ నారాయణ, ఎంపీటీసీ మాధవి, రాంరెడ్డి, విఘ్నేశ్‌గౌడ్, గిరిధర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అశోక్, వంశీ, శ్యామ్, బాల్‌రాజ్, రమణారెడ్డి, క్రిష్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో బీఆర్‌ఎస్‌లో చేరిక..

బీఆర్‌ఎస్‌తోనే గ్రామాల అభివృద్ధి, యువతకు భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఎమ్మెల్యే సమక్షంలో గొల్లపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్‌కి చెందిన యువకుడు విఘ్నేశ్‌గౌడ్‌తో పాటు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పార్టీ కండువా కప్పి ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆహ్వానించారు. పార్టీ కోసం పనిచేస్తే తగిన గుర్తింపు ఉంటుందని చెప్పారు.

షాబాద్‌లో..

షాబాద్: తెలంగాణ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలె యాదయ్య గెలుపునకు దోహదం చేస్తాయని ఎమ్మెల్యే సతీమణి కాలె జయమ్మ, షాబాద్ జెడ్పీటీసీ సతీమణి శాన్వి పేర్కొన్నారు. మంగళవారం షాబాద్ మండల కేంద్రంలో గడపగడకు తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే గెలిపిస్తాయన్నారు. కాంగ్రెస్, బీజేపీలను ప్రజలు నమ్మరన్నారు. అన్నదాతల సంక్షేమానికి పెద్దపీట, బడుగు, బలహీన, నిరుపేద వర్గాలకు అన్ని విధాలా అండగా నిలుస్తున్నామని వారు స్పష్టం చేశారు. ఇంటింటికి సంక్షేమ పథకాలను అందజేస్తున్న ప్రభుత్వాన్ని మరోసారి ఆదరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ జడల లక్ష్మి, సర్పంచ్‌లు కేతన రమ్య క్రిష్ణ, మంగమ్మ, రాజేందర్‌గౌడ్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌దే అధికారమని, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యను మూడోసారి భారీ మెజార్టీతో గెలిపించాలని శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ సాత విజయలక్ష్మి, నవాబ్‌పేట్ ఎంపీపీ కాలె భవానీ పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలోని పలు వార్డుల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశంలోనే ఆదర్శంగా నిలిచాయన్నారు. గుడిమల్కాపురం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాపారావు, కౌన్సిలర్లు చంద్రమౌళి, శ్రీనాథ్‌గౌడ్, సంతోష్, శ్వేత, సాత ప్రవీణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారం ఖాయం

- దొరలపాలనకు చరమగీతం పాడండి
- చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి భీంభరత్
- పామెన గ్రామంలో ఆరు గ్యారంటీ కార్డుల పంపిణీ



షాబాద్: సీతారాంపూర్ ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి భీంభరత్

చేవెళ్ల: రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని నియోజకవర్గ సమన్వయ కమిటీ అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్‌లు డి వెంకట్‌రెడ్డి, గోనెప్రతాప్‌రెడ్డి, వీరేందర్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఆగిరెడ్డి సమత, సరితలు పేర్కొన్నారు. ఆలూరు, వెంకన్నగూడ, దేవునిఎర్రవల్లి గ్రామాల్లో పామెన భీంభరత్ తరుపున మండల నాయకులు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదేళ్లుగా పాలించిన బీఆర్‌ఎస్ దొరలపాలనకు చరమగీతం పాడాలంటే కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో టేకుపల్లి శ్రీనివాస్, యాదిరెడ్డి, పారాయణరెడ్డి పాల్గొన్నారు.

దామరగిద్దలో కాంగ్రెస్‌లో పలువురి చేరిక...

దామరగిద్ద గ్రామంలో బీఆర్‌ఎస్‌కి చెందిన యువకులు మాజీ సర్పంచ్ మధుసూదన్‌గుప్తా ఆధ్వర్యంలో పామెన భీంభరత్ సమక్షంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

పామెన గ్రామంలో..

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతుందని మాజీ సర్పంచ్ దావల్‌గారి గోపాల్‌రెడ్డి అన్నారు. ఆయన గ్రామంలో స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆరు గ్యారంటీలపై ప్రచారం చేశారు. రాజేందర్ రెడ్డి, ఎర్ర గోపాల్, చంద్రారెడ్డి, కావలి బాబు, తదితరులు పాల్గొన్నారు.

షాబాద్‌లో..

షాబాద్: కేసీఆర్‌ను ప్రజలు నమ్మరని కాంగ్రెస్ చేవెళ్ల ఎమ్మెల్యే అభ్యర్థి పామెన భీంభరత్ అన్నారు. నాగర్‌గూడ, తాళ్లపల్లి, పోతుగల్, సీతారాంపూర్, లక్ష్మరావుగూడ, ఏట్ల ఎర్రవల్లి, తిమ్మారెడ్డిగూడ, రేగడిదోస్వాడ, తిర్మలాపూర్ గ్రామాల్లో పీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మధుసూదన్‌రెడ్డి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శులు పీసరి సురేందర్‌రెడ్డి, ఎస్. రాంరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రాన్ని కేసీఆర్ కుటుంబం లూటీ చేసి, భ్రష్టు పట్టించారని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన గుణపాఠం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంటారెడ్డి, మహిళ అధ్యక్షురాలు అశ్వని, మద్దూరు సర్పంచ్ నరేందర్‌రెడ్డి, ఎంపీటీసీలు కుమ్మరి చెన్నయ్య, అశోక్, జయమ్మ వెంకట్‌రెడ్డి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

మొయినాబాద్‌రూరల్‌లో..

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయమని భీంభరత్ అన్నారు. అజీజ్‌నగర్‌లోని ఆయన నివాసంలో చిలుకూరు గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి భీంభరత్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు యశ్వంత్, మత్స్యకార్మిక నాయకులు యాదయ్య, సత్యనారాయణముదిరాజ్‌తో పాటు సుమారు 100 మంది పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో పురానం వీరభద్రస్వామి, కీసరి సంజీవరెడ్డి, చిలుకూరి ఉపసర్పంచ్ సుధాకర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లి: ప్రచారం నిర్వహిస్తున్న జాహెదా ఖాన్

శంకర్‌పల్లిలో..

శంకర్‌పల్లి: కాంగ్రెస్‌దే అధికారమని ఏఐసీసీ సభ్యురాలు, ఎన్నికల పరిశీలకురాలు జాహెదా ఖాన్ పేరొన్నారు. భీంభరత్‌కు మద్దతుగా అభ్యర్థి సతీమణి జ్యోతితో కలిసి పలు వార్డుల్లో ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్‌కి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో చిపుల సత్యనారాయణరెడ్డి, మండల అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు ప్రకాశ్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యం

- జిల్లా నాయకుడు కొత్త మాణిక్‌రెడ్డి
- బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని పిలుపు

మొయినాబాద్‌రూరల్: అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయడమే బీఆర్‌ఎస్ లక్ష్యమని జిల్లా నాయకుడు కొత్త మాణిక్‌రెడ్డి అన్నారు. మంగళవారం అజీజ్‌నగర్‌లో గ్రామ అధ్యక్షుడు మాడి మల్లారెడ్డి గడపగడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త మాణిక్‌రెడ్డి, అజీజ్‌నగర్ క్లస్టర్, మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు శ్రీహరియాదవ్‌లు మాట్లాడారు. రాష్ట్రంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసి పార్టీని గెలిపించాలని వారు కోరారు. ఎమ్మెల్యేగా కాలె యాదయ్యను గెలిపించాలంటే కారు గుర్తుకు ఓటేయాలని ఓటర్లను వారు అభ్యర్థించారు. జిల్లా మత్స్యకార్మిక సంఘం అధ్యక్షుడు వెంకటాపూర్ బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వాములకు అన్నదానం

షాద్‌నగర్: పట్టణంలోని శివమారుతీ గీతా అయ్యప్ప మందిరంలో మంగళవారం నాగులపల్లి గ్రామానికి చెందిన ఆవుల నర్సింహ్మారెడ్డి అయ్యప్ప స్వాములకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా దేవాలయంలో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు గోలెపు చంద్రశేఖర్, బసప్ప, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు విశ్వం, మంజు శ్రీ రాఘవేందర్, రేటికల్ నందీశ్వర్, భద్రప్ప, రామరాజు యాదవ్, స్వామి, మల్లేశ్ యాదవ్, వెంకటేష్‌గౌడ్, జంగయ్య, ఆర్‌ఎన్ రాజు, పాండు తదితరులు పాల్గొన్నారు.



పూజలో పాల్గొన్న స్వాములు

పోలింగ్ నిర్వహణ తీరుతెన్నుల పరిశీలన

కలెక్టరేట్‌లో మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ



మైక్రో అబ్జర్వర్లకు శిక్షణ ఇస్తున్న జనరల్ అబ్జర్వర్లు

ఇబ్రహీంపట్నం రూరల్: పోలింగ్ నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలన చేయాలని మైక్రో అబ్జర్వర్లకు జనరల్ అబ్జర్వర్లు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా ఎన్నికల అధికారి , జనరల్ అబ్జర్వర్లు, మైక్రో అబ్జర్వర్లతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శిక్షణకు హాజరైన జనరల్ అబ్జర్వర్లు ఆర్‌ఎస్ వినమ, శిల్పగుప్తా, చంద్రకాంత్ కృష్ణారావు డాంగే, రామ్‌కుమార్, తైతులంగ్ పమేయలు మాట్లాడుతూ.. జిల్లాలో జరుగుతున్న ఎనిమిది నియోజకవర్గాలకు శాసన సభ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతి అంశంపై స్పష్టమైన అవగాహన కల్గి ఉండాలన్నారు. పోలింగ్‌కు ముందు రోజు ఉ.7 గంటలకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌కు చేరుకొని సిబ్బందికి సామగ్రి అందిందా లేదా చూసుకోవాలని చెప్పారు. సిబ్బందితో పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాలు ఉన్నాయా లేవా చూసుకోవాలని తెలిపారు. పోలింగ్ విధుల్లో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. పోలింగ్ పూర్తయ్యే వరకు ప్రతి అంశాన్ని గమనించాలని ఆదేశించారు. ప్రతి పార్టీ తరపున ఇద్దరు ఏజెంట్లను నియమించనుండగా పోలింగ్ కేంద్రాల్లోకి ఒక్కరికి మాత్రమే అనుమతించాలన్నారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఎన్నికల సంఘం గుర్తింపు కార్డులు కలిగిన వారు మినహా ఇతరులను లోపలికి అనుమతించరాదన్నారు.

ఓటరు ఇంటికి పోల్‌చీటీ

- బీఎల్‌ఓల ద్వారా నేరుగా పంపిణీ
- భయం లేకుండా ఓటు వేయాలంటూ స్లిప్ వెనకాల సూచన



పోల్‌చీటీలను పంపిణీ చేస్తున్న బీఎల్‌ఓలు

దౌల్తాబాద్: శాసనసభ ఎన్నికలకు సంబంధించి ఓటర్లకు పోల్‌చీటీలను పంపిణీ చేసేందుకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. ఈసీ ఆదేశాల మేరకు బీఎల్‌ఓలు ఓటరు ఇంటికి వెళ్లి నేరుగా ఓటింగ్ స్లిప్‌లను అందజేస్తున్నారు. ఈ నెల 23వ తేదీలోగా పంపిణీ కార్యక్రమాన్ని పూర్తి చేసేలా కార్యాచరణ సిద్ధం చేశారు.

పలు సంస్కరణలకు శ్రీకారం..

ఓటర్లను చైతన్య పరిచేందుకు ఎన్నికల సంఘం పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. మునపటి సాధారణ ఎన్నికల సమయంలో ఓటర్లకు పోల్ చీటీలు మాత్రమే పంపిణీ చేశారు. కానీ ఇప్పుడు చీటీతో పాటు పలు సూచనలతో కూడిన మూడు పేజీల ఓటరు గైడ్‌ను పంపిణీ చేస్తున్నారు. ఓటరు జాబితాలో పేరు నమోదు, తనిఖీ చేసుకునేందుకు అవసరమైన వెబ్‌సైట్, ఆన్‌లైన్ నమోదు, తపాల బ్యాలెట్ విధానం గురించి ఇందులో పొందుపరిచారు. ఓటు వేయడానికి వెళ్లే ముందు పాటించాల్సిన సూచనలు, పోలింగ్ కేంద్రాల్లో ఐదు దశల్లో పోలింగ్ ప్రక్రియ, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల్లో ఓటు వేసే విధానం, ఎన్నికల సమయంలో ఎవరైనా అభ్యర్థులు మద్యం, డబ్బులు పంపిణీ చేస్తే సివిజిల్ యాప్, 1950 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం అందించాలని సూచిస్తున్నారు.

ఓటరు ఇంట్లో లేకుంటే..

ఎన్నికల సిబ్బంది ఓటరు ఇంటికి వెళ్లిన సమయంలో ఓటరు అందుబాటులో లేని యెడలా.. ఓటింగ్ రోజున సంబంధిత పోలింగ్ కేంద్రం వద్ద అందుబాటులో ఉంచుతారు. వారితో పాటు చిరునామాలో లేని వారివి, డూప్లికెట్‌గా భావించినవి అక్కడే ఉంటాయి. తగిన ఆధారం చూపి ఓటర్ స్లిప్‌ను పొందవచ్చు. చీటీ లేకపోయినా ఈసీ పేర్కొన్న 12 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదైనా ఒకటి చూపించి ఓటరు జాబితాలో పేరుంటే ఓటు వేయవచ్చు.

వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు



స్కీంల గురించి ప్రజలకు వివరిస్తున్న నాయకులు

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీ స్కీంలను అమలు చేస్తుందని, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి కసిరెడ్డి నారాయణరెడ్డికి మద్దతుగా మండల కేంద్రంలోని పలు కాలనీల్లో గడపగడపకూ కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ అసమర్థ పాలన సాగిస్తోందని, అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తుక్కుగూడ విజయభేరి సభలో సోనియాగాంధీ ప్రకటించిన విధంగా అధికారంలోకి రాగానే గ్యారంటీ కార్డును అమలు చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, నాయకులు భాస్కర్‌రెడ్డి, హన్మానాయక్, యాదగిరిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, జహంగీర్‌అలీ, చందోజీ కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, పట్టణ అధ్యక్షుడు రాంచందర్‌నాయక్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, ఎస్సీసెల్ అధ్యక్షుడు అశోక్, ఇక్బాల్, లక్ష్మయ్య రాజేందర్ ఉన్నారు.